# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 143 వ భాగం

## సూర్య వంశం – 11, రామ కథ - 1

సూర్యవంశం సాగి సాగి రాముడి దగ్గిరకి వచ్చింది. ఇన్నాళ్ళకి రావణుడి చావు దగ్గిర పడింది కనక రాముడు బయల్దేరుతున్నాడు రాక్షస సంహారానికి. తాటకిని చంపడం అయింది. తర్వాత వంతు మారీచ సుబాహులది.

క. గారామునఁ గౌశిక మఖ
మా రాముఁడు గాచి దైత్యు నధికు సుబాహున్
ఘోరాజిఁ ద్రుంచి తోలెన్
మారీచున్ నీచుఁ గపటమంజులరోచున్. [9-261]

విశ్వామిత్రుడి (కౌశికుడు) యాగం (మఖము-యజ్ఞము) సమయంలో దాన్ని గొప్పగా (గారామున) కాపాడి (కాచి), రాక్షసుల్లో అధికుడైన సుబాహుణ్ణి చంపి, మారీచుణ్ణి తరిమికొట్టాడు. ఈ మారీచుడు ఎటువంటివాడో ముందే చెప్పేస్తున్నాడు మనకి పోతన – కపట మంజుల రోచున్; కపట-మోసపూరితమైన, మంజుల-మనోజ్ఞమైన (బంగారు లేడి వేషం వేస్తాడు కదా ముందు ముందు), రోచున్-రూపం ధరించినవాడు.

మ. ఒక మున్నూఱు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షుచాపంబు బా
లకరీంద్రంబు సులీలమైఁ జెఱకుఁగోలం ద్రుంచు చందంబునన్
సకలోర్వీశులు చూడఁగా విఱిచె దోశ్శక్తిన్ విదేహక్షమా
పక గేహంబున సీతకై గుణమణిప్రస్ఫీతకై లీలతోన్. [9-262]

తర్వాత విషయం సీతాపరిణయం. మూడువందల మంది (ఒక మున్నూఱు) తోసుకుంటూ తెచ్చిన శివధనుస్సుని (లలాటోగ్రాక్షుచాపంబు; లలాట–నుదురు; ఉగ్ర–భయంకరమైన; అక్ష–కన్ను ఉన్నవాడు, ఇంకెవరు శివుడే) అవలీలగా గున్న ఏనుగు (బాల కరీంద్రంబు) చెరుకుగడని విరిచినట్టూ (చెఱకుఁగోలం ద్రుంచు చందంబునన్), రాజులందరూ చూస్తూండగా (సకలోర్వీశులు; సకల, ఉర్వి–భూమి; ఈశులు–రాజులు) తన భుజ బలంతో (దోశ్శక్తిన్) సులువుగా విరిచాడు . ఎందుకు విరిచాడంటే, సీతకోసం. ఆ సీత ఎటువంటిది? గుణమణి ప్రస్ఫీత – సుగుణాల రాసి, మిక్కిలి స్వచ్ఛమైనది.

ఇక్కడనుంచి ఆరు కంద పద్యాలలో రాముణ్ణి చిత్రకూటంలో దింపుతాడు పోతన. మొదటి పద్యం సీతా కళ్యాణం. రాముడితోపాటు సూర్యవంశంలోకి అడుగుపెడుతున్నందుకు ఇందులో సీతని పోతన ఏమంటున్నాడో చూడండి. ముఖకాంతివిజిత సిత ఖద్యోతన్ (సిత–తెల్లని, ఖద్యోతుడు – ఆకాశంలో వెలిగేవాడు–సూర్యుడు)

క. భూతలనాథుఁడు రాముఁడు
ప్రీతుండై పెండ్లియాడెఁ బృథుగుణమణి సం
ఘాతన్ భాగ్యోపేతన్
సీతన్ ముఖకాంతివిజిత సితఖద్యోతన్. [9-263]

ఈ కింద పద్యం రాముడు పరశురాముడిమీద సాధించిన విజయం. క్రితం సారి శివధనుస్సు ఎత్తినప్పుడు, ‘సరేలేవోయ్ అది పాతదైపోయి ఎత్తేసరికి విరిగిపోయింది, రాముడి గొప్ప ఏమిటి’ అంటారని ఇందులో చెప్తున్నాడు. ఈ సారి భార్గవరాముణ్ణి నిజ బాహుబల స్థేమంబున (సామర్థ్యంతో) భంగపరిచాడు. ఈ పరశురాముడి గురించి కూడా ఆయన గొడ్డలి ధరించేవాడు అని చెప్తున్నాడు (దీర్ఘ కుఠారోద్దామున్; కుఠారము–గొడ్డలి).

క. రాముఁడు నిజబాహుబల
స్థేమంబున భంగపఱిచె దీర్ఘకుఠారో
ద్దామున్ విదళీకృతనృప
భామున్ రణరంగభీము భార్గవరామున్. [9-264]

కైకకి ముందు వరం ఇచ్చినట్టు రెండు వరాలిచ్చి రాముణ్ణి అడవికి పంపాడు దశరథుడు. ఇలా వెళ్ళాల్సిరావడం దేనికంటే దశముఖుణ్ణి చంపడానికే కదా? ఈ విషయాన్ని పోతన ఏమంటున్నాడంటే రావణుడి పది తలలకీ రాముడు చంద్రుడివంటివాడుట. ఇందులో తుహినధామున్ అంటే? తుహిన (మంచులా చల్లదైనదానికి) ధాముడు – నివాసమైనవాడు. చంద్రుడు చల్లదనాన్ని ఇచ్చేవాడిగా వర్ణించడం కవులకి అలవాటే.

క. దశరథుఁడు మున్ను గైకకు
వశుఁడై తానిచ్చి నట్టి వరము కతన వా
గ్దశ చెడక యడివి కనిచెను
దశముఖముఖకమలతుహినధామున్ రామున్. [9-265]

కింద పద్యంలో “జన” అనే పదం ఎలా వాడాడో గమనించండి. తండ్రి (జనకుడు) పంపితే అది మేలు అనుకుని, సీతా (జనకజ), లక్షణులతో రాముడు (జనపతి), రాజులకి (జనపాలుర) ఆరాధ్యమైన, శత్రు దుర్భేద్యమైన (ద్విషద్– శత్రువులకి, అసాధ్య–దుర్భేద్యమైనది) అయోధ్యని విడిచాడు.

క. జనకుఁడు పనిచిన మేలని
జనకజయును లక్ష్మణుండు సంసేవింపన్
జనపతి రాముఁడు విడిచెను
జనపాలారాధ్య ద్విషదసాధ్య నయోధ్యన్. [9-266]

భరతుణ్ణి, తన నిజ పాదుకలని పూజించేవాడిని రాజ్యంలో ఉంచి రాముడు చిత్రకూటం అనే పర్వతం ఎక్కాడు. ఈ చిత్రకూటం ఎటువంటిదో చెప్తున్నాడు. గురు (గొప్పదైన) గోత్రాచలము (కులపర్వతాలు కలది).

క. భరతున్ నిజపదసేవా
నిరతున్ రాజ్యమున నునిచి నృపమణి యెక్కెన్
సురుచిర రుచి పరిభావిత
గురుగోత్రాచలముఁ జిత్రకూటాచలమున్. [9-267]

సీ. ఆ వనంబున రాముఁ డనుజ సమేతుడై–
సతితోడ నొక పర్ణశాల నుండ
రావణు చెల్లలు రతిఁ గోరి వచ్చిన
మొగి లక్ష్మణుఁడు దాని ముక్కు గోయ
నది విని ఖరదూషణాదులు పదునాల్గు
వేలు వచ్చిన రామవిభుఁడు గలన
బాణానలంబున భస్మంబు గావింప
జనకనందన మేని చక్కఁదనము [9-269]

తే. విని దశగ్రీవుఁ డంగజ వివశుఁ డగుచు
నర్థిఁ బంచినఁ బసిఁడిఱ్ఱి యై నటించు
నీచు మారీచు రాముఁడు నెఱి వధించె
నంతలో సీతఁ గొనిపోయె నసురవిభుఁడు. [9-269.1]

ఈ సీసం లో దాదాపు అరణ్యకాండ అంతా చెప్పేస్తున్నాడు పోతన. శూర్పణఖ వచ్చి రాముణ్ణి కోరింది. లక్ష్మణుడు ముక్కు కోస్తే ఖర దూషణులతో సహా పధ్నాలుగు వేలమంది రాముడి చేతిలో చచ్చారు. సీత అందం గురించి విన్నాడు దశకంఠుడు. మన్మధుడి (అంగజుడు) వల్ల వివశుడైపోయి, వచ్చి అడిగితే మారీచుడు బంగారు లేడిలా నటిస్తూ వెళ్ళాక రాముడు వాణ్ణి వధించాడు. ఈ సందులో రావణుడు సీతని అపహరించుకుపోయాడు. ఈ పద్యంలో 'పసిడిఱ్ఱి' అంటే పసిడి–బంగారం; ఇఱ్ఱి–లేడి.

వ. అంతనా రామచంద్రుండు లక్ష్మణసహితుండై, సీత వెదక నరుదెంచి, నిజకార్యనిహతుండైన జటాయువునకుఁ పరలోకక్రియలు గావించి, ఋశ్యమూకంబునకుం జని. [9-271]

క. నిగ్రహము నీకు వల దిఁక
నగ్రజు వాలిన్ వధింతు నని నియమముతో
నగ్రేసరుఁగా నేలెను
సుగ్రీవుం జరణఘాతచూర్ణగ్రావున్. [9-272]

రాముడు లక్ష్మణుడితోపాటు ఋశ్యమూకం చేరి సుగ్రీవుడితో చెప్తున్నాడు. నీకు అగ్రజుడైన వాలి అంటే ఇంకేమీ భయం వద్దు, నేను వాలిని చంపుతాను.

క. లీలన్ రామవిభుం డొక
కోలం గూలంగ నేసె గురు నయశాలిన్
శీలిన్ సేవితశూలిన్
మాలిన్ వాలిన్ దశాస్యమానోన్మాలిన్. [9-273]

ఒకే ఒక బాణంతో ఇంద్రుడిచ్చిన మాల ధరించినవాడిని (మాలిన్), రావణుడి గర్వం అణిచినవాడిని (దశాస్య మానోన్మాలిన్) అయిన వాలిని చంపాడు. పాదాలలో లీలన్, కోలం, శీలిన్, మాలిన్, వాలిన్ అనేవి నవ్వు తెప్పిస్తాయి.

క. ఇలమీఁద సీత వెదకఁగ
నలఘుఁడు రాఘవుఁడు పనిచె హనుమంతు నతి
చ్ఛలవంతున్, మతిమంతున్,
బలవంతున్, శౌర్యవంతు, బ్రాభవవంతున్. [9-274]

భూమ్మీద సీతని వెదకడానికి రాఘవుడు హనుమంతుణ్ణి పంపించాడు. ఈ హనుమంతుడు – అతిచ్ఛలవంతుడు – అమిత వేగం కలవాడు; మంచి బుద్ధి కలవాడు (మతిమంతున్), బలవంతుడు, శౌర్యం ఉన్నవాడు, ప్రాభవం ఉన్నవాడు (మహిమాన్వితుడు).

క. అలవాటు కలిమి మారుతి
లలితామిత లాఘవమున లంఘించెను శై
వలినీగణసంబంధిన్
జలపూరిత ధరణి గగన సంధిం గంధిన్. [9-275]

మారుతి ఎటువంటివాడు? లంఘించడం అనేది అలవాటుగా ఉన్నవాడు. పుట్టగానే సూర్యుణ్ణి పండు అనుకుని అందుకోవడానికి ఎగిరాడు కదా?) ఈయన అనేక నదులు సమూహంగా ఉండేదాన్ని (శైవలినీ-నదులు, గణ-సమూహం; సంబంధిన్-బంధువైనది), జలపూరిత ధరణి గగన సంధిన్ (ఆకాశాన్నీ జలంతో ఉన్న భూమినీ కలిపేది) అయిన సముద్రాన్ని (కంధిన్; కం-నీరు; నీటికి నిధి) దాటాడు అవలీలగా (లలితామిత లాఘవమున).

రామాయణం అంతా మరీ కట్టె-కొట్టె-తెచ్చె అన్నట్టుగానూ, మరి విశదంగా కాకుండా రాముడు విష్ణువు అవతారంలో ఒకటి అని చెప్పడానికి పోతన సులభంగా కంద పద్యాలలో వివరిస్తున్నాడు. మిగతా రామాయణం వచ్చే వ్యాసాలలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS